RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 320 | నవంబర్ 28, 2025 | వెల : రూ.3-00



**ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దుల్లో 6 చెక్ పోస్టులు**

3లో..




# ఒకే మాట..

- అన్ని పార్టీల ఎంపీలు ఏకతాటిపైకి వచ్చి..
- రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడాలి:భట్టి
- కేంద్రంలో పెండింగ్ అంశాలపై దృష్టి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం తొమ్మిదో షెడ్యూల్ సవరణపై చర్చ
- ఢిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు.. సమాచారాన్ని వెంటనే అందించడమే లక్ష్యం
- విజన్ 2047, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం పై సమగ్ర ప్రణాళిక సిద్ధం: డిప్యూటీ సీఎం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

"రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీల ఎంపీలది ఒకే మాట కావాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయో జనాలను కేంద్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. భట్టి గురువారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ఎంపీలతో విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పలు అత్యవసర అంశాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, నిధుల విడుదల వంటి విషయాలపై ఎంపీలతో కలిసి వ్యవస్థపూర్వక చర్చ సాగింది. సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ అత్యవసరమని నొక్కిచెప్పారు. ఈ అంశాన్ని పార్లమెంటులో అడ్జర్న్‌మెంట్ మోషన్, ప్రశ్నోత్తరాల ద్వారా బలంగా ముందుకు తేవాలని ఎంపీలకు సూచించారు.

**- పీఎంను కలిసేందుకు సిద్ధం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పూర్తికేబినెట్‌తో కలిసి ప్రధానమంత్రిని కలసి వినతిపత్రం సమర్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్రం వద్ద ఉన్న పెండింగ్ సమస్యలపై సమగ్ర మద్దతు తీసుకురావడమే ఈ చర్యల లక్ష్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంపీలకు అవసరమైన సమాచారం వెంటనే అందించేందుకు ఢిల్లీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు భట్టి విక్ర మార్క వెల్లడించారు. రాష్ట్రానికి సంబం ధించిన విద్యుత్, నీటిపారుదల, జీఎస్టీ, మౌలిక సదుపాయాలు సహా పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న నిధుల వివరాలు అక్కడ సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీలు కేంద్రంలో రాష్ట్ర సమస్యలను బలంగా ప్రస్తావించేందుకు అవసరమైన డేటా-డాక్యుమెంట్లను అందించే విధంగా ఈ విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్, రాబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం వంటి అంశాలను కూడా చర్చించారు. డిసెంబర్ 9న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేయనున్న సందర్భంగా ప్రభుత్వ విజయాలు, లక్ష్యాలను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రానికి సంబం ధించిన 12 శాఖలపై 47 పెండింగ్ అంశాలను ఈ సమావేశంలో గుర్తించి, సెమికండక్టర్ రంగంపై పెట్టుబడులు, కేంద్ర సహకారం సాధ్యాసాధ్యాలపై కూడా చర్చ సాగింది.




# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆవేదన




**డిసెంబర్ 3న పిటిషన్‌పై కీలక విచారణ**
**పరిస్థితి ఆరోగ్య అత్యవసరమని కోర్టు ఆందోళన**

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఢిల్లీలో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణిస్తున్న నేపథ్యంలో, కాలుష్య నియంత్రణ కోసం దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం స్వీకరించింది. ఈ కీలక అంశంపై డిసెంబర్ 3న విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. గాలి కాలుష్య పరిస్థితి నిత్యం దిగజారుతున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడానికి సమగ్ర దృష్టి అవసరమని కోర్టు అభిప్రాయపడింది. ఇది కేవలం సీజనల్ సమస్య కాదని, దేశ రాజధానిలో నివసించే కోట్లాది ప్రజల ఆరోగ్యానికి నేరుగా ముప్పని న్యాయస్థానం స్పష్టం చేసింది. వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్, ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని, ఇది ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా భావించాల్సిన అంశమని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్, సమస్య తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. "ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతోంది. కానీ ప్రశ్న ఏమిటంటే ు పరిష్కారం ఎలా?" అని కోర్టు వ్యాఖ్యానించింది. "కాలుష్యం విషయంలో కోర్టు ఏం మ్యాజిక్ చేయగలదు?" అనే ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్య, కాలుష్య సమస్యలో ప్రభుత్వ యంత్రాంగ పాత్ర, నిపుణుల సూచనలు, మరియు శాస్త్రీయ దృష్టితో రూపొందించాల్సిన ప్రణాళికల ప్రాముఖ్యాన్ని మరింత హైలైట్ చేసింది.

మిగతా 3వ పేజీలో..

# 2015 ర్యాంకర్లకు తాత్కాలిక ఊరట

**- తెలంగాణ గ్రూప్-2పై సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు**

**వేద న్యూస్, హైదరాబాద్:**




తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2015-16 గ్రూప్-2 పరీక్షల వివాదం మరో కీలక దశకు చేరింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పును గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని ధర్మాసనం తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ నిర్ణయంతో 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు పెద్ద ఊరట లభించింది. పరీక్షలపై ఎన్నో ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజా తీర్పు మళ్లీ వివాదాన్ని కొత్త దిశగా మళ్లించింది. గ్రూప్-2 పరీక్షల మూల్యాంకన ప్రక్రియపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. వైట్‌నర్ వాడిన పత్రాలు, దిద్దుబాట్లు ఉన్న సమాధాన పత్రాలను కూడా చెల్లుబాటు చేసినట్లు గుర్తించిన అభ్యర్థులు, దీనిని అక్రమంగా పేర్కొంటూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ విచారణను చేపట్టిన సింగిల్ బెంచ్, విడుదల చేసిన ఎంపికల జాబితాను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, మూల్యాంకన నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పుపై మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. సంస్థ తరఫున సమర్పించిన వాదనల్లో సింగిల్ బెంచ్ తీర్పు అమలు చేస్తే పెద్ద స్థాయిలో పరిపాలనా అంతరాయం కలుగుతుందని, ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనితో సీజే ధర్మాసనం ఈ





మిగతా 3వ పేజీలో..

# నల్లచెరువు ఆక్రమణలపై తప్పుదారిపట్టించే ప్రచారం..!

**- అసలు నిజాలు వెల్లడించిన హైడ్రా - కాలుష్యంపై కోర్టును అప్రమత్తం చేసిన హైడ్రా**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

కూకట్‌పల్లి నల్లచెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై హైడ్రా చర్యలు తీసుకుంటున్న సమయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు హైడ్రా స్పష్టం చేసింది. బుధవారం చెరువు పరిధిలో ఎలాంటి కొత్త ఆక్రమణలను తొలగించలేదని, 176 సర్వే నంబరులో ఉన్న తాత్కాలిక షెడ్లను ఇప్పటికే ఖాళీ చేయించామని హైడ్రా తెలిపింది. చెత్త సేకరణదారులు, స్క్రాప్ వేరుచేసి అమ్ముకునే వారు ప్లాస్టిక్ కవర్లతో వేసుకున్న తాత్కాలిక షెడ్లు చెరువు ఫుల్ ట్యాంక్ పరిధిలోకి రావడంతో, నోటీసులిచ్చి స్వచ్ఛందంగా వెళ్లిపోయారని సంస్థ వివరించింది. నల్లచెరువు 176 సర్వే నంబరులోని తాత్కాలిక గుడిసెలు చెరువులోకి చెత్త చేరడం, నీటి కాలుష్యానికి కారణమవుతుండటంతో హైడ్రా కోర్టును అప్రమత్తం చేసింది. హైకోర్టు కూడా ఇదే విషయం గమనించి, సర్వే నంబర్లు పరిశీలించి, నోటీసులిచ్చి ఖాళీ చేయించాలంటూ సూచించింది. దీనితో రెండు మూడు రోజుల క్రితమే అక్కడ ఉన్న చెత్త సేకరణదారులు స్వయంగా గుడిసెలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇది పూర్తిగా చట్టపరమైన చర్య మాత్రమేనని హైడ్రా



మిగతా 3వ పేజీలో..

# స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం

**- విక్రమ్-1 ఆవిష్కరణతో అంతరిక్ష రంగంలో భారత్ కొత్త దిశ : ప్రధాని మోదీ**

**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ రావిర్యాలలో అత్యాధునికంగా నిర్మించిన స్కైరూట్ ఏరోస్పేస్ "ఇన్ఫినిటీ క్యాంపస్"ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశపు తొలి ప్రైవేట్ కమర్షియల్ లాంచ్ వాహనం 'విక్రమ్-1' రాకెట్‌ను ఆవిష్కరించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ స్పేస్ సదుపాయంగా నిలిచే ఈ క్యాంపస్‌ను అభినందించిన ప్రధాని, భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీకగా నిలుస్తుందని ప్రశంసించారు. "సైకిల్‌పై రాకెట్ భాగాలు మోసుకెళ్లిన రోజుల నుండి ఈ స్థాయికి చేరడం భారత్ ప్రగతికి నిదర్శనం" అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రధాని మాట్లాడుతూ, భారత అంతరిక్ష రంగం దిశ మార్చుకున్న మలుపుల్లో ఇది ఒక ముఖ్యమైన ఘట్టమని చెప్పారు. స్టార్టప్‌లకు ఇచ్చిన అవకాశాలు, నియంత్రణా సంస్కరణలు, కోఆపరేటివ్ ఎకోసిస్టమ్ ఏర్పాటుతోనే ఈ రోజు ఇలాంటి స్థాయిలో ప్రైవేట్ స్పేస్ సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయం, వాతావరణ అధ్యయనం, ఉపగ్రహ కమ్యూనికేషన్, గ్లోబల్



మిగతా 3వ పేజీలో..

# స్క్రాచ్ కార్డుల పేరుతో పెరుగుతున్న మోసాలు

**వేద న్యూస్, హైదరాబాద్:**

సోషల్ మీడియా, వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా 'స్క్రాచ్ చేయండి బంపర్ ప్రైజ్ గెలుచుకోండి' అంటూ పంపుతున్న లింకులు భారీ మోసాలకు దారితీస్తున్నాయని తెలంగాణ పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. వీటిలో చాలావరకు యూజర్ల వివరాలను దోచుకునేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఫేక్ స్కామ్‌లు అని అధికారులు స్పష్టం చేశారు. చిన్న ప్రైజ్ ఆశతో లింకులు క్లిక్ చేయడం వల్ల బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతున్న

మిగతా 3వ పేజీలో..



## జీపీగా ఏర్పాటు చేయాలి: బొట్టుపల్లి గోపాల్ రాజుర గ్రామస్తుడు



మా రాజుర గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి. మా గ్రామంలో 700 పై చిలుకు జనాభా కలిగ ఉండి దాదాపు 500 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో నూతన పంచాయతీగా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి కాబట్టి నూతన గ్రామ పంచాయతీ గా ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది.

## అన్ని అర్హతలు ఉన్నాయి: బోయిరే సుబ్బరావు, రాజురవాసి



మా గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయి ఎన్నో ఏండ్లుగా ఇతర గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్నాము. ఇప్పటికైనా నూతన పంచాయతీగా ఏర్పాటు చేస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాము.



# కొత్త జీపీలు లేనట్టేనా?

**- నూతన పంచాయతీలు ఏర్పాటు చేయాలని జనం వేడుకోలు - అవేవీ పట్టించుకోకుండానే సర్కారు నోటిఫికేషన్.. - ఇక ప్రజల ఆశలు అడియాసలేనా?**

**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన వేళ కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. గత సర్కారు హయాంలో తండాలు, పెద్ద గ్రామ పంచాయతీలను పరిపాలన సౌలభ్యం కోసం చిన్న చిన్న గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయగా, కొన్ని గ్రామ పంచాయతీలు మాత్రం రెండు మూడు గూడాలను కలిపి ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా పంచాయతీ పరిధి లోని గ్రామాల్లో జనాభా, ఓటర్ల పెరుగుదల వంటి అంశాలతో రెండు మూడు గ్రామాలను కలిపి ఏర్పాటు చేసిన గ్రామాలను విడదీసి నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి గల యువత డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామాలను పంచాయతీ లుగా మారిస్తే గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా ఎన్నికల్లో పోటీ చేయాలనుకొనే యువకులకు అవకాశాలు సైతం పెరుగుతాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ సుమారుగా రెండేండ్ల కాలం పాటు అటు ఎన్నికలు నిర్వహించక ఇటు పంచాయతీలు ఏర్పాటు చేయక ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**- కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో...**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో కొన్ని పంచాయతీలు రెండు మూడు గ్రామాలను కలిపి ఒకే గ్రామ పంచాయతీగా కొనసాగుతున్నాయి. దీని వల్ల పంచాయతీ నిధులు, అభివృద్ధి ఫలాలు అన్ని గ్రామాలకు ఆశించిన స్థాయిలో సమానంగా అందడం లేదనే ఆరోపణలున్నాయి. ఆసిఫాబాద్ మండలంలోని రాజూర, రెబ్బెన మండలం వంకులం గ్రామలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు స్థానిక నాయకులు, అధికారులు, మంత్రులకు వినతి పత్రాలు అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రాజుర గ్రామం 2018 కంటే ముందు బూరుగూడ గ్రామ పంచాయతీలో భాగంగా ఉండేది. అనంతరం ఆ గ్రామ పంచా యతీలోని మోతుగూడ, రాజుర రెండు గ్రామాలను కలిపి మోతుగూడ కేంద్రంగా నూతన పంచా యతీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు గ్రామా ల జనాభా, ఓటర్లు పెరగడం వల్ల రాజుర గ్రామా న్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు మూడేండ్ల నుంచి స్థానిక, రాష్ట్ర స్థాయి నాయకులు, అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. ఈ సారి పంచాయతీ ఏర్పడి ఎన్నికలు ఉంటాయని అనుకున్న గ్రామస్తుల కల.. కలగానే మిగిలేలా ఉందని వాపోతున్నారు.

## ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్నాము : లోనారే కిరణ్, రాజుర యువకుడు

మా గ్రామం గతంలో బూరుగూడ, ప్రస్తుతం మోతుగూడ గ్రామ పంచాయతీలలో భాగంగా కొనసాగుతున్నది. గతంలో ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు అర్హతలు లేకపోవడం వల్ల ఇతర గ్రామ పంచాయతీలలో కలిపారు. ప్రస్తుతం జనాభా, ఓటరు అన్ని విధాలుగా అర్హతలు ఉన్నాయి కాబట్టి ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలి.



# వృద్ధుల మానసిక ఆరోగ్యంపై అవగాహన

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




వృద్ధుల మానసిక ఆరోగ్యముపై జాగ్రత్త లు అనే అంశంపై గురువారం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, ఇతర ఆరోగ్య సిబ్బందికి వర్క్ షాప్ కార్యక్రమం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వరంగల్ మరియు హెల్ప్ ఏజ్ ఇండియా హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో డాక్టర్ ప్రకాశ్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని క్షేత్రస్థాయిలో ఉండే వృద్ధుల మానసిక వ్యాధులను గుర్తించి ఎప్పటికప్పుడు మందులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యవంతమైన వృద్ధ సమాజాన్ని తయారు చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. వరంగల్ నగర ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ శ్రీధర్ రాజు ఆరోగ్య కార్యకర్తలకు వృద్ధుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ముఖ్యంగా వృద్ధులు నిత్యజీవితంలో ఎదుర్కొనే కుంగుబాటు డిప్రెషన్, చిత్తవైకల్యం, డిమేన్సియో జ్ఞాపకశక్తిని కోల్పోయే వ్యాధి రాకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ, తగు జాగ్రత్తలు మందులు వాడుకుంటూ ఉండాలని వృద్ధులకు, కుటుంబ సభ్యులకు తెలియపరుస్తూ, అవగాహన పరుస్తూ ఆరోగ్య కార్యకర్తలు పనిచేయాలని కోరారు. డెమో అనిల్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులు సమాజ సంపద వారి కి నిత్యం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణ కు ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షులు కోన్రెడ్డి మల్లారెడ్డి కార్యక్రమ అధ్యక్షులుగా వ్యవహరిం చారు. జాయింట్ సెక్రటరీ ఏ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిద్దాం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో పంచాయితి ఎన్నికల కు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించి,ఎన్నికలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో,అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయితి ఎన్నికలు మూడు విడుతాలలో జరిగే ఎన్నికలు పూర్తి స్థాయి పటిష్ట భద్రత ఏర్పాట్లతో ప్రశాంత వాతవరణంలో నిర్వహిద్దామని ,ఎన్నికల నిర్వహణలో ఇప్పటికే అనుభవం ఉన్న అధికారులు,సిబ్బంది నూతనంగా డిప్లాయ్ అయిన సిబ్బందికి మాంగ్గదర్శనం చేస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే వారిపట్ల కటినంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తూ అక్రమ మద్యం,నగదు, ఉచితల పంపిణీపై నిఘా ఉంచుతూ,ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు,డైనమిక్ చెక్ పోస్ట్ లు పెట్టి తనిఖిలు చేపట్టాలని ఆదేశించారు.నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ అధికారులు తరచుగా పర్యటిస్తూ పరిస్థితులను నియంత్రణలో ఉంచాలని తెలిపారు.ఎన్నికల అనంతరం నిర్వహించే విజయోత్సవ ర్యాలీలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచి ,ప్రజా శాంతి భద్రతలకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నెరస్థులతో పాటు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడేవారు, రౌడి షీటర్స్ పై,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి,అవసరం అయితే బైండోవర్ చేయాలని ఆదేశించారు.

**సోషల్ మీడియాపై నిఘా మరింత కఠినతరం**

గ్రామపంచాయితి ఎన్నికల సందర్బంగా జిల్లలో సోషల్ మీడియా పై నిఘా కటినతరం చేసి విద్వేషాలు రేచ్చగోట్టేల , ప్రజలను తప్పుదోవ పట్టించేలా వచ్చే ప్రకటనలు పోస్ట్ చేసిన,షేర్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్ లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి, ఇన్స్పెక్టర్లు మొగిలి ,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవి, నాగేశ్వరరావు , సిబ్బంది పాల్గొన్నారు.


# రుద్రూర్ మండలంలో 10 నామినేషన్ లు దాఖలు

**వేద న్యూస్, రుద్రూర్ :**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ల స్వీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలలో తొలిరోజు రుద్రూర్ మండలంలోని 11 గ్రామపంచాయతీలకు గాను గురువారం సర్పంచ్ పదవులకు 10 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎంపీడీవో బాలగంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్ నగర్- 2, అంబం -2, బొప్పాపూర్- 1, చిక్కడపల్లి -1, రాయకూర్ -1, రాయకూర్ క్యాంపు-1, రాణంపల్లి -1, రుద్రూర్ - 1 నామినేషన్ లు దాఖలు అయ్యాయని వివరించారు.

వార్డు మెంబర్లకు 3 నామినేషన్ల దాఖాలు

అక్బర్ నగర్ -1,బొప్పాపూర్-1, రాణంపల్లి-1 మొత్తం 03 నామినేషన్లు దాఖలు అయినట్లు పేర్కొన్నారు.



# ఒలంపియాడ్ లో మెరిసిన తాడిచెర్ల విద్యార్థులు

**వేద న్యూస్, తాడిచెర్ల:**



జడ్పీహెచ్ఎస్ తాడిచెర్ల లో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీలను నిర్వహించగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తాటిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. సీనియర్ విభాగంలో, లాస్య 10వ తరగతి, ఉపన్యాస పోటీల్లో ఎండి శైలాని 9వ తరగతి, జూనియర్ విభాగంలో, సాయి హర్షవర్ధన్ 7వ తరగతి, ఉపన్యాస పోటీల్లో సాయి శ్రేష్ట 6వ తరగతి, విజేతలుగా నిలిచారు. మండల స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను మరియు ఇతర పాఠశాలల నుండి ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి అభినందించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయులు జయ భాస్కర్, పూర్ణచందర్, శివరాణి, శర్మ, వాసవి, లలిత, ఉషారాణి చంద్ర ప్రకాష్, ప్రకాష్ మరియు మండలం లోని ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నామినేషన్ల కేంద్రాలను పరిశీలించిన ఎస్సై

**వేద న్యూస్, రుద్రూర్ :**




సర్పంచ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన రుద్రూర్, అక్బర్ నగర్, సులేమాన్ నగర్, రాయకూర్ గ్రామాలల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ ల కేంద్రాలను గురువారం ఎస్సై సాయన్న పరిశీలిం చారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగిందని అన్నారు. ఎస్సై వెంట ఎంపీడీవో బాల గంగాధర్, ఆర్ ఓ శ్రీనివాస్, గ్రామ పంచాయ తీ సెక్రటరీ ప్రేమ్ దాస్ తదితరులు ఉన్నారు.

# ఇల్లందకుంటలో వైన్ షాప్స్ తొలగించాలి

**- సీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలో**

**- ఆలయ కమిటీ చైర్మన్ రామారావు**




**వేద న్యూస్, ఇల్లంద కుంట:**

ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలోని వైన్ షాపులను తొలగించాలని ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కరీంనగర్ అబ్కారీ సూపరిం టెండెంట్ కి వినతి పత్రం సమర్పించారు. అపర భద్రాద్రిగా పేరుగాంచిన వందల ఏండ్ల చరిత్ర కలిగిన రాముల వారి ఆలయ ప్రతిష్ట దెబ్బతిన కుండా చూడాలని కోరారు. వైన్ షాపుల వల్ల భక్తులు దర్శనానికి వచ్చే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే వైన్ షాపులను ఆలయానికి దూరంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా భరత్ నాయక్ రాథోడ్ జన్మదిన వేడుకలు

వేద న్యూస్, టేక్మాల్:

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ పరిధిలోని షాబాద్ గ్రామ పంచాయతీ లోని చిన్నారి భరత్ నాయక్ రాథోడ్ 3వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో కుటుంబ సభ్యులు,తాత హరిసింగ్, నాన్నమ్మ రంకి, తండ్రి రాజు నాయక్ రాథోడ్, తల్లి లలిత, అక్క కోవిధ రాథోడ్, అన్నా రాజన్ నాయక్ రాథోడ్, దేవుడు ఎప్పుడు చల్లగా ఉండాలని కోరుకున్నారు.



# నల్లచెరువు ఆక్రమణలపై తప్పుదారిపట్టించే ప్రచారం..!

స్పష్టం చేసింది. అయితే, ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకుని కొందరు వ్యక్తులు 180 సర్వే నంబర్‌ను చూపుతూ పేదల గుడిసెలను కబ్జా ప్రయత్నంగా చూపించి గందరగోళాన్ని సృష్టిస్తున్నారని హైడ్రా ఆరోపించింది. వాస్తవానికి 180 సర్వే నంబరుపై ఎలాంటి చర్యలూ చేపట్టలేదని, అక్కడి కొందరు మూడో వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ పేదలను అడ్డంకులుగా వాడుకుంటున్నారని సంస్థ వెల్లడించింది. కొంతమంది 180 సర్వే నంబర్‌ను చూపిస్తూ నష్టపరిహారం కోసం హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు సమాచారం. హైడ్రా అధికారులు పేర్కొన్నదేమిటంటే చెరువు పరిరక్షణ, ఫుల్ ట్యాంక్ స్థాయి సంరక్షణ, నీటి నాణ్యత కాపాడటం తమ బాధ్యతగా చూస్తున్నామని. సర్వే నంబర్లు క్లియర్‌గా చెక్ చేసి, కోర్టు సూచనల మేరకు మాత్రమే చర్యలు చేపడుతున్నామని హైడ్రా తెలిపింది. నల్లచెరువు చుట్టూ ఉన్న అక్రమ కార్యకలాపాలు, కబ్జా ప్రయత్నాలు, కాలుష్య సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు చర్యలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆవేదన



సమస్యకు మూలకారణాలను గుర్తించడం అత్యవసరం అని, తాత్కాలిక చర్యలతో సమస్య పరిష్కారం కాదని కోర్టు స్పష్టం చేసింది. స్టబుల్ బర్నింగ్, వాహనాల ఉద్గారాలు, పరిశ్రమల కాలుష్యం, ధూళి కణాలు వంటి అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. దీర్ఘకాలిక పరిష్కారాలు నిపుణుల సూచనలు, శాస్త్రీయ పరిశోధనలు, రాష్ట్రాలు%–%మధ్య ప్రభుత్వ సమన్వయం ద్వారా మాత్రమే సాధ్యమని కోర్టు స్పష్టం చేసింది. ప్రజారోగ్యాన్ని కాపాడడానికి తక్షణ చర్యలతో పాటు శాశ్వత వ్యూహాలు ఏర్పాటుచేయాలని సూచించింది. డిసెంబర్ 3న జరుగనున్న విచారణలో అన్ని పక్షాలు సమగ్ర ప్రణాళికలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఢిల్లీలో గాలి నాణ్యత సంక్షోభం పరిష్కారానికి ఈ విచారణ కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.

# స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం

స్పేస్ మార్కెట్ వంటి రంగాల్లో చిన్న శాటిలైట్లకు డిమాండ్ భారీగా పెరుగుతుందని, భారత్ ఈ అవకాశాలకు తగిన విధంగా సిద్ధమైందని ఆయన పేర్కొన్నారు. "జెన్- ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు ప్రపంచానికి తమ ప్రతిభ నిరూపించే సమయం ఇది" అని మోదీ పిలుపునిచ్చారు. స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్–1 రాకెట్ దేశీయ అవసరాలకే కాక విదేశీ శాటిలైట్లను కూడా తక్కువ ఖర్చుతో భూమి కక్ష్యలో ప్రవేశపెట్టగల సామర్థ్యంతో రూపుదిద్దుకుంది. 300 కిలోల వరకు పేలోడ్స్‌ను తీసుకెళ్లగలిగే ఈ రాకెట్ కార్బన్ ఫైబర్ నిర్మాణంతో రూపొందించడం దీని ప్రత్యేకత. ఏ ప్రయోగ కేంద్రం నుంచైనా 24 గంటల్లో అసెంబుల్ చేసి లాంచ్ చేయగలిగే సౌలభ్యం విక్రమ్–1ను గ్లోబల్ లాంచ్ మార్కెట్‌లో పోటీ స్థాయికి తీసుకువెళ్తుందని కంపెనీ వెల్లడించింది. బహుళ శాటిలైట్లను ఒకేసారి కక్ష్యలో ప్రవేశపెట్టగల రచనతో విక్రమ్–1 ప్రపంచ ఉపగ్రహ ప్రయోగ వ్యవస్థకు కొత్త అవకాశాలను తెరచనుంది. స్కైరూట్‌ను మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ ఢాకా స్థాపించారు. 2022లో భారతదేశ తొలి ప్రైవేట్ సబ్–ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–ఎస్ ప్రయోగం ద్వారా చరిత్ర సృష్టించిన స్కైరూట్, ఇప్పుడు కమర్షియల్ లాంచ్ వాహనంలోనూ దేశాన్ని మరో స్థాయికి తీసుకెళ్తోంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో ప్రపంచ అగ్రస్థానంలో నిలుస్తుందన్న నమ్మకాన్ని ఈ ఆవిష్కరణ మరింత బలపరిచింది.

# 2015 ర్యాంకర్లకు తాత్కాలిక ఊరట

కేసును మరోమారు పరిశీలించేందుకు అంగీకరించి, తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ నిర్ణయాన్ని సస్పెండ్ చేయడంతో ఎంపికలు తిరిగి అమల్లో కొనసాగుతున్నాయి. ఈ తీర్పుతో బాధిత ర్యాంకర్లకు తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ, కేసు ఇంకా పూర్తిగా ముగిసినట్లేం కాదు. పరీక్షల పారదర్శకత, మూల్యాంకన నైతికత, ప్రక్రియల బలోపేతం వంటి అంశాలపై ధర్మాసనం ఇప్పటికీ కీలకంగా దృష్టి సారిస్తోంది. రానున్న విచారణల్లో ఇరు వర్గాల వాదనలు వినిపించి తుది తీర్పు ఇవ్వనున్నట్లు హైకోర్టు పేర్కొంది. ఈ కేసు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల వ్యవస్థపైనే ప్రభావం చూపే అవకాశముంది.

# స్క్రాచ్ కార్డుల పేరుతో పెరుగుతున్న మోసాలు

సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతు న్నాయని తెలిపారు. ఈ స్కామ్‌లలో దొంగలు అత్యంత ఆకర్షణీయమైన బహుమతులను చూపిస్తూ బాధితుల మనసును గెలుచుకుంటున్నారు. "స్పిన్ ది వీల్", "స్క్రాచ్ విన్", "మీరు ఎంపికయ్యారు" వంటి వాక్యాలతో మెసేజ్‌లు పంపి, లింక్‌పై క్లిక్ చేయగానే మొబైల్ డేటాలు, బ్యాంక్ వివరాలను దొంగిలించే మాల్వేర్ పని చేస్తుందని పోలీసులు వివరించారు. చాలాసార్లు ఈ లింకులు అధికారిక సంస్థల పేర్లను దుర్వినియోగం చేస్తుండటంతో ప్రజలు నమ్మకంతో క్లిక్ చేస్తారని అధికారులు చెప్పారు. బాధితులు ప్రధానంగా అజ్ఞాత నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మడం, సైబర్ అవగాహన లోపం, బహుమతి ఆశతో చేసే నిర్లక్ష్యం కారణమని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా బంపర్ ప్రైజ్‌లు, లక్కీ డ్రా పేర్లతో పంపే వాగ్దానాలు పూర్తిగా మోసపూరితమైనవని శాఖ వెల్లడించింది. అనుమానాస్పద లింకులు, యాప్‌లు, ఆఫర్లు వెంటనే డిలీట్ చేయాలని, ఏ పరిస్థితిలోనూ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ఇలాంటి సైబర్ మోసాలను నియంత్రించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. అవగాహన పెరిగితేనే ఆర్థిక నష్టాలు తగ్గించగలమని పోలీసుల అభిప్రాయం. డిజిటల్ యుగంలో జాగ్రత్త, ఆత్మనిబ్బరం, ధృవీకరణ ప్రజలను మోసాలనుంచి కాపాడగలదని పోలీసు శాఖ స్పష్టం చేసింది.

# ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

గ్రామ పంచాయతీ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్ టీ, ఎస్ఎస్ టీ, జోనల్ అధికారులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా సాధారణ, వ్యయ పరిశీలకులు పీ రవి కుమార్, కే రాజ్ కుమార్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ గురువారం ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు.పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్ బృందాలు నగదు ,ఇతర ఆభరణాలు సీజ్ చేసీనప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించ వద్దని సూచించారు.ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం



కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, భోజనాలు తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చు పై వివరించారు.సమావేశంలో నోడల్ అధికారులు శేషాద్రి, భారతి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, డీపీఓ షరీఫుద్దిన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్ట్‌లు



**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్ట్ లు తంగళ్ళపల్లి జిల్లెల్ల,గంభీరావుపేట్ పెద్దమ్మ ముస్తాబాద్ వెంకట్రావ్ పల్లి, వేములవాడరూరల్ ఫజుల్నగర్, బోయిన్పల్లి నర్సింగపూర్,రుద్రాంగి మనాల క్రాస్ రోడ్ లు ఏర్పాటు చేసి మద్యం,డబ్బు ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలపలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరిగింద ˇని జిల్లా ఎస్పీ తెలిపారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసి చెక్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి మద్యం, డబ్బు సరఫరా కాకుండా జిల్లాలో సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెక్ పోస్ట్ ల వద్ద విధులలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ మద్యం,డబ్బు రవాణా అడ్డుకట్ట వేయాలని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఎన్నికల నిబందనలు పాటించాలని,తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకు వెళ్లినట్లయితే సీజ్ చేయాలని,అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు వ్యాపారం పెళ్లిళ్లు ఇతర అవసరాలకు డబ్బులను తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమమని ఎన్నికల నియమావలిని అందరూ పాటిస్తూ వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



**వేద న్యూస్, టేక్మాల్:**

గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ మెదక్ జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 06మండలాలైన , అల్లాదుర్గ్, రేగోడు, టేక్మాల్ హవేలీ గన్పూర్, పాపన్నపేట , శంకరంపేట ఆర్, 160 సర్పంచ్, 1402వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో రేగోడు, శంకరంపేట ఆర్, అల్లాదుర్గ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామపత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల సమస్య పరిష్కరించాలి

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

రానున్న రోజుల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారమని ఏఐసీసీ అబ్జర్వర్ దేబాషిస్ పట్నాయక్ అన్నారు. గురువారం పార్వతీపురంలో ఏపిసీసీ మెంబెర్ జగత శ్రీనివాస్, డిసిసి బుల్లిబాబు, పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఆ పార్టీ నాయకులు తీళ్ళ గౌరీ శంకరరావు, కోలా కిరణ్ కుమార్, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, చొక్కాపు వెంకటరమణ, శాంతి కుమారి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ప్రజలు ప్రాంతీయ పార్టీ అయినా బి.ఆర్.ఎస్ కు ఓటు వేసి గెలిపించారన్నారు. కొద్ది సంవత్సరాలు తర్వాత బిఆర్ఎస్ పనితనం తెలుసుకున్న ప్రజలు కాంగ్రెస్ కే పట్టం కట్టారన్నారు. ఆంధ్రాలో కూడా అదే పరిస్థితి వస్తుందన్నారు. ఆంధ్ర, బీహార్ ఇలా ఎక్కడ చూసినా ఓట్ చోరీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలు ప్రకారం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సంస్థత నిర్మాణ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దానిలో భాగంగా జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో పార్టీ చాలా దృఢ సంకల్పంతో ఉందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జంఝావతీ ప్రాజెక్టు సమస్య వేధిస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి అన్నారు. తర్వాత ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ



వస్తే జంఝావతి ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందన్నారు. జిల్లాను ఏనుగుల సమస్య పీడిస్తోందన్నారు. ఇప్పటివరకు 12 మంది వ్యక్తులు చనిపోగా సుమారు ఆరు కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. సుమారు ఐదేళ్లుగా ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు లేకపోవడం అన్యాయం అన్నారు. పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి కాలేదు అన్నారు. జిల్లాలో 90 శాతం చెరువులు, గెడ్డలు తదితర నీటి వనరులు కబ్జాకు గురయ్యాయి అన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీ తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య దశాబ్దాలుగా వేధిస్తోంది అన్నారు. ఆయా సమస్యలన్నీ కాంగ్రెస్ పార్టీతో పరిష్కరింపబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జాత దిలీప్ కుమార్, గర్భాపు రవికుమార్, రాయల లక్ష్మ, చిట్టయ్య, రాంబాబు, బంకపల్లి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం, నవంబర్ 28, 2025

# టెట్ అర్హతపై సుప్రీంకోర్టు పునరాలోచించాలి



**వేద న్యూస్, శంకరపట్నం:**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ అర్హతపై కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పార్లమెంట్ సమావేశాలలో తీర్మానం చేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మిన హాయింపు ఇవ్వడానికి తీర్మానం చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం. ఏ ఖాద్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సుప్రీం కోర్టు ద్వారా సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత ఉండాలనే నిబంధనపై సుప్రీంకోర్టు పునరాలోచన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం,ఉపాధ్యాయ సంఘాల తరుపున సుప్రీం కోర్టులో అప్పిలు చేయడం జరిగింది అన్నారు. టెట్ పాస్ కాకపోతే ఉద్యోగమే పోయే పోయేట్లు ఉందని, కొందరు ఉపాధ్యాయులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కానీ ఎవరు తొందరపడి ఎటువంటి అఘాయిత్యాలకు, దారుణాలకు చోటు ఇవ్వదని ధైర్యంగా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు ఇప్పుడు పుస్తకాలతో కుస్తీలు పట్టడం కష్టం అవుతుందన్నారు. టెట్ ఎపుడైతే అమలైందో దానికంటే ముందు సర్వీస్ లో వచ్చిన వారందరికీ మినహాయించాలని అన్నారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు టెట్ అనే అంశంపై గందరగోళ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఒక నిర్ణయాత్మక సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

# బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం

– డీసీపీఓ బూర్ల మహేష్




**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీసీపీఓ బూర్ల మహేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు సూర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాల్యం ఎంతో అమూల్యమైనదని బాల్య వివాహం వలన బాలికల చదువు, ఆరోగ్యం పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాలికల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రకాలుగా కృషి చేస్తుందని బాలికల విద్యను ప్రోత్సహించడానికి కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. 2030 నాటికి బాల్య వివాహాలు లేని దేశంగా నిర్మించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిఎంసి శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్, ఉపాధ్యాయుడు శ్రీ వర్ధన్, సూర్ సంస్థ కోఆర్డినేటర్ సంతోష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్, దేవాజీ, జెండర్ స్పెషలిస్ట్ రాణి, సాగర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముధుని ఎన్నికల కోడ్ ఉంటుందని ఆదేశాలు జారీ చేసిన పట్టించుకోకుండా అధికార కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే డా" కవ్వంపల్లి సత్య నారాయణ ప్రజా స్వామ్య బద్దంగా జరుగవలసిన ఎన్నికల ను మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలలో సర్పంచ్ గా ఏక గ్రీవంగా ఎన్నుకోండి రూ.20 లక్షలు ఇస్తామని చెప్పడం, పత్రిక ప్రకటనలు, వాట్సాప్ గ్రూపులో ప్రచారం చేయడం ఎన్నికల కోడ్ ఉల్లంగించడమే అని సామాజిక ఉద్యమ కారుడు, ఎం ఆర్పిఎస్.జిల్లా కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్ అన్నారు. ప్రజలు చైతన్య వంతులై అధికార రాజ్యాంగ ఫలాలు సామాన్య ప్రజలకు అందేలా ఆలోచన చేయాలనీ కోరారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు



**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (నవంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# చేనేత ఎన్నికలు కూడా నిర్వహించాలి

**వేద న్యూస్,శాయంపేట:**

స్థానిక సంస్థలతో పాటు మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం కు ఎన్నికలు నిర్వహించాలని అఖిలభారత పద్మ శాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడు సం వత్సరాల నుండి చేనేత సంఘానికి పర్సన్ ఇన్చార్జిగా పాలకవర్గాని కొనసాగిస్తూ ఎన్నికలు పెట్టకుండా నిర్లక్ష్యానికి గుర్తు చేస్తున్నారని వారు తెలిపారు. చేనేత సంఘం కు ప్రభుత్వం నుండి వచ్చిన నిధులపై విచారణ చేయాలని అధికారులకు విన్నవించుకుంటే సంఘం పాలకవర్గం రాజీనామాను ఆమోదించి స్పెషల్ ఆఫీసర్ ను నియమించడం అన్నారు. ఇప్పటికైనా చేనేత సొసైటీ నిధులకు సంబంధించి విచారణ చేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు చేనేత సంఘానికి కూడా ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.

# నకిలీ వీసాలతో గల్ఫ్ ఏజెంట్ల చేతుల్లో మోసపోకండి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిధిలోని గ్రామాల లో ఉన్నట్టు వంటి నిరుద్యోగ యువకులు గల్ఫ్ దేశాల మోజులో పడి పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళేవారు నకిలీ వీసాలతో నకిలీ ఏజెంట్ల చేతిలో పడి మోసపోకండి అని సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సిరిసిల్ల అశోక్ తెలిపారు. పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళే నిరుద్యోగ యువకులు నకిలీ ఏజెంట్లు చెప్పే మయా మాటలకు నమ్మి మోస పోవద్దు నకిలీ వీసాలు చూపించి డబ్బులు తీసు కొని వారీ వెంట సంవత్సరాలు వెంట తింప్పుకోని చివరికి 2, 3 నేలల టూరిస్ట్ విసాలు ఇచ్చి రెండు, అరునెలల కాంట్రాక్ట్ వీసాలు ఇచ్చి గల్ఫ్ కు పంప్పిచ్చి చేతులు దులుపు కొనే ఏజంట్లను నమ్మవద్దు రెండు మూడు అరు నెలల టూరిస్ట్ వీసా మీదా పంప్పియడం తో అయొక్క వీసా పరిమితి ముగియడం తో రూమ్ నుండి బయటకు పంప్పివ్వగ రూమ్ లేక తిండి లేక అవస్థల పడి ఇంటికి తిరిగి ప్రయాణం అవ్వడంతో అప్పుల పాలై చాలా మంది మత్తు పానీయాలకు బానిస అవ్వడంతో ప్రాణాల మీద విరక్తి చెంది ఆత్మ హత్యలు చేసుకోవడం మంచిది కాదని అన్నారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లను నమ్మవద్దు గల్ఫ్ దేశాలకు వెళ్ళే యువకులు లైసెన్స్ కలిగివున్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని గ్రామాలలో నకిలీ ఏజెంట్లకు సంబదించ్చిన సమాచారం ఉంట్టే పోలీస్ స్టేషన్ కు లేదా సంబధిత అధికారులకు సమ చారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రతి ఒక్కరూ రోడ్డు పైన ప్రయాణించే వాహనాల దారులు భద్రత ట్రాఫిక్ నీయమ నిబంధనలు పాటించాలి ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే మీగమ్య స్థానం చేరుకుంటారు. మోటార్ సైకిల్ పై వెళ్ళేటప్పుడు మద్యం సేవించి హెల్మెట్ లేకుడా




– ఎస్సై అశోక్

పోన్ మాట్లాడుతూ వెళ్ళకూడదు ప్రతి వహన దారుడు తప్పకుండా లైసెన్స్ కలిగివుండాలి మోటార్ సైకిల్ పై త్రిబుల్ రైడింగ్ చేయ కూడదని అన్నారు. అంతే కాకుండా వాహన యజమానులు వాహనాలు మైనర్ బాలిక బాలురులకు ఇవ్వకూడదని తల్లి తండ్రులకు సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిరిసిల్ల అశోక్ సూచించారు.

# రాజ్యాంగమే దేశంలో అత్యున్నత చట్టం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో కొండూరు సరస్వతి మార్కండేయ కేఎస్ఎం ఫౌండేషన్ సహకారంతో గురువారం నాడు సుబేదారి లోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో మూట్ కోర్ట్, వక్తృత్వం వ్యాస రచన పోటీలను నిర్వహించింది. ఈ పోటీలకు యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజ్ ఆడిటో రియంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుదర్శన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు అనేక చట్టాలను, రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన దేశానికి అనుగుణమైన రాజ్యాంగాన్ని రూపొందించారని, రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, రాజ్యాంగ స్ఫూర్తిని, ఆదర్శాలను కొనసాగించాలని, రాజ్యాంగం దేశంలో అత్యున్నత చట్టమని, పౌరులు రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దాని ఆదర్శాలను కొనసాగించాలని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అనుభవించడంతో పాటు ప్రాథమిక విధులను కూడా తప్పనిసరిగా పాటించినప్పుడే రాజ్యాంగ విలువలను కాపాడినట్లవుతునదని చెప్పారు. పౌరులు రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచుకొని రాజ్యాంగం యొక్క ఆదర్శాలను, ఆశయాలను కాపాడే వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు మెమెంటోలు, లా బుక్స్, ప్రశంసా పత్రాలు అతిధుల చేతుల మీదుగా




అందజేశారు. వక్తృత్వ పోటీలో "లింగ న్యాయం, న్యాయపరమైన క్రియాశీలత అనే అంశంపై నిర్వహించిన పోటీలో పి. శ్రుతి మొదటి స్థానంలో, చాందిని రెండవ స్థానంలో, ఆర్. తేజస్వి మూడవ స్థానంలో నిలిచారు. డిజిటల్ యుగంలో భారతదేశంలో గోప్యతా హక్కుఅనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో తౌరయ్య రాయన్ మొదటి స్థానంలో, పి. శ్రుతి రెండవ స్థానంలో, వి. శ్రీవల్లి ఆండాళ్ మూడవ స్థానంలో నిలిచారు. వి. చందన కు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. అదేవిధంగా మూట్ కోర్ట్ పోటీలో 13 జట్లు పాల్గొనగా, మొదటి బహుమతిని ఆదర్శ లా కాలేజీకి చెందిన ఎ. సుధీర్, ఎం. సతీష్, బి. రంజిత్ లకు లభించింది. రెండవ స్థానంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా కళాశాలకు చెందిన ఎన్. శివ, బి. కావ్య, జైనాబ్ ఫాతిమా , మూడవ స్థానంలో వి. శ్రీవల్లి ఆండాళ్, పి. శ్రుతి, బి. వర్ష విజేతల్లో ఉన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, కెఎస్ఎం వ్యవస్థాపకులు కేపీ ఈశ్వర్ నాథ్, యూనివర్సిటీ అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోల శంకర్, న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సి. సుజాత, డాక్టర్ ఎస్. పద్మజ, కె. హరి ప్రసాద్, డాక్టర్ వై. ప్రభాకర్, డాక్టర్ జి. వేదశ్రీ, డాక్టర్ ఆర్. లక్ష్మణ్, డాక్టర్ చల్లా శ్రీనివాస్, డాక్టర్ మధు, బోధనేతర సిబ్బంది, విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జనరల్ సీట్లలోను బీసీలు పోటీ చేయవచ్చు

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు బీసీల రిజర్వే షన్ పరిధిలోనే ఉండి ఎదగాలని జనరల్ కేటగిరీ లో పోటీ చేయరాదని బీసీ ప్రజల మనసు ల్లో నాటారని దీని ప్రకారం బీసీలకు కేవలం రిజర్వేషన్ స్థానాలపై పరిమితమై జనరల్ ( ఓపెన్) స్థానాలలో పోటీ చేయడం లేదని తెలంగా ణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆయన మాట్లాడారు. బీసీ స్థానాలలో పోటీ చేయడం అసాధ్యం అని నమ్మేలా అగ్రకుల ఆధిపత్యం కాపాడే ఒక రాజకీయ వ్యూహంలో భాగమని అన్నారు. రిజర్వేషన్ విధానం బీసీలకు ఒక బీసీలకే కాదు (ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ మహిళలకు సైతం ) సామాజిక న్యాయం కల్పించే సాధనం అయినా రాజకీయ పార్టీలు రిజర్వేషన్ విధానాన్ని ఆధారంగా మలిచాయని అన్నారు. జనరల్ సీట్లలో మీకు గెలుపు చాన్స్ లేదు మీరు రిజర్వ్ సీట్లలోని సుంక్షితం అనే సందేశాన్ని పదే పదే ప్రచారం చేశారని ఫలితంగా బీసీలలో జనరల్ సీటు అంటేనే అగ్రకులానికే అనే ఆలోచన లోతుగా పాతకపోయిందని పేర్కొన్నారు.జనరల్ సీట్లలో బీసీలను మాత్రం దూరంగా ఉంటే రాజకీయ వ్యూహాలు డబ్బు, మద్యం, ఖండ బలం, బంధు ప్రభావం అన్న అస్త్రాలతో జనరల్ స్థానాలలో అగ్రకుల అభ్యర్థులను నిలబెడుతున్నారని బీసీలు జనరల్ సీట్లలో పోటీ చేయాలనుకున్న పార్టీ టికెట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మద్దతు ఇవ్వడం లేదని ఓసీలు రిజర్వేషన్ సీట్లలో పోటీ చెయ్యలేరు కాబట్టి మీరు కూడా జనరల్ సీట్లకు రాకూడదనే లాజిక్ తో బీసీలను మానసికంగా బంధిస్తున్నారని అన్నారు.బీసీలు పార్టీ కోసం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగపడతారు తప్ప ఖర్చు పెట్టే సామర్థ్యం లేదని టికెట్ ఇచ్చేటప్పుడు నిర్ణయించేస్తారని తెలిపారు. తెలంగాణలో బీసీ జనాభాలో 50–56 శాతం ఉన్న జనరల్ స్థానాలలో బీసీ అభ్యర్థులు తక్కువే అని ఇది రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని అనడానికి స్పష్టమైన నిదర్శనమని అన్నారు. కర్ణాటకలో లింగాయత్, వక్క లిగలు, తమిళనాడులో థేవర, వన్నీయర్, గౌండర్ వంటి బీసీ వర్గాలు బీహార్ లో యాదవులు, కుర్మీలు, జనరల్ సీట్లలోనే రాజకీయ ఆధిపత్యం సాధించారని ఈ రాష్ట్రాలలోనే బీసీల రిజర్వేషన్లు కనీసం హామీగా మాత్రమే తీసుకొని జనరల్ సీట్లలో పోటీ చేసి గెలిచారని ఇది చట్టసభలోనే కాదు తెలం గాణలో నేటి నుంచి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఎందుకు అమలు చేయకూడదు బీసీలు ఆలోచించాలని కోరారు. రిజర్వ్ సీట్లు హక్కు కానీ పరిమితి కాదు రాజకీయ పార్టీలు ఏర్పర్చిన మానసిక బంధం నుంచి బీసీలు బయటపడాలని కోరారు.



ఓపెన్ కేటగిరీలో అగ్రకుల రిజర్వేషన్ మాత్రం సాగుతోందని బీసీలు కేవలం రిజర్వేషన్ సీట్లకు మాత్రమే పోటీ చేస్తే రాజకీయ శక్తి పునర్వ్యవస్థీకరణ ఎప్పటికీ జరగదని ఆదిపత్య కులవర్గాలు సిద్ధంగా ఉంటాయని రిజర్వేషన్లు మన హక్కు కానీ జనరల్ సీట్లకు పోటీ చేయడం మన గౌరవం అని అన్నారు. జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేసేలా పార్టీపై ఒత్తిడి తేవాలని బీసీలలో ఆర్థికంగా బలపడిన కొత్త తరం రాజకీయంగా ముందుకు రావాల ని, బీసీ సామాజిక వర్గాల మధ్య ఐక్యత పెంచుకోవాలని ఉపకుల విభజనను అధిగమించాలని, జనాభా ఎక్కువ ఉన్న కులాలు అతి తక్కువ జనాభా గల వారికి అవకాశం కల్పించడం కోసం రిజర్వేషన్ సీట్లలో పోటీ చేయకుండా జనరల్ సీట్లకు పోటీ చేయాలని రిజర్వేషన్ సీలింగ్ కాకుండా చూడాలని అలా అయితే నే బీసీలు తమ సంఖ్యాబలాన్ని అధికార బలాన్ని బలంగా మార్చుకోగలరని జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేయడం అంటే కేవలం ఎక్కువ సీట్లు గెలవడం మాత్రమే కాదు అగ్రకుల ఆధిపత్య రాజకీయ వ్యవస్థనే ప్రశ్నించడం కాబట్టి ఇప్పుడు బీసీ యువత మేల్కొనవలసిన సమయం ఆసన్నమైందని రిజర్వేషన్ సీట్లు మాత్రమే కాదు మొత్తం రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం బీసీల హక్కు అని అప్పుడు పోరాడాలని సూచించారు.

# ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి సన్మానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:** హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులుగా నూతనంగా నియమించబడిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి రాహత్ పర్వీన్, 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి మొహమ్మద్ జమీరుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# 'చందన' @ చర్చావేదిక

**- డిస్కషన్ అడ్డా ఇది..**
**- హెూటల్ చరిత్ర సుమారు 30 ఏండ్లకుపైనే..**




**వేద న్యూస్, జమ్మికుంట:**

వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్న జమ్మికుంట, సమీప పరిసర ప్రాంత, మండల పరిధిలోని ప్రజలు, పట్టణవాసుల డిస్కషన్ అడ్డాగా 'చందన' కొనసాగుతోంది. ఈ హెూటల్‌కుసుమారు 30 ఏండ్లకుపైనే చరిత్ర కలిగి ఉండి.. చక్కగా కొనసాగుతోండటం విశేషమని చెప్పొచ్చు. జమ్మికుంట నడిబొడ్డున బ్రిడ్జి కింద అన్నపూర్ణ థియేటర్ వెళ్లే లైన్‌లో ఉన్న ఈ హెూటల్‌కు మూడు దశాబ్దాలకుపైన హిస్టరీ కలిగి ఉన్నది.

**అందరూ అక్కడే..!**

ప్రతీ రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు జమ్మికుంట సమీప పరిసర ప్రాంత ప్రజలు నాయకులు, పుర ప్రముఖులు కొందరు, చిరు వ్యాపారులు, విలేకరులు.. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏదో ఒక సమయంలో చందన హెూటల్ వద్దకు వచ్చి చాయ్ తాగి.. చర్చలు కొనసాగిస్తుంటారు. ఇక్కటికి రాకపోతే తమకు పొద్దుపోదు అని భావించేవారూ ఉన్నారని చెప్పడంలోనూ ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇక ప్రస్తుత స్థానిక పంచాయతీ ఎన్నికల రాజకీయ నేపథ్యంలో నాయకులు, పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు, మద్దతుదారులు, జర్నలిస్టులు, కార్యకర్తలు నిత్యం ఉండే ప్రాంతంగా ఇది మారనుంది. ప్రతీ రోజూ ఇక్కడికి వచ్చి చాయ్ తాగి నలుగురితో ముచ్చటిస్తూ.. రాజకీయాలను విశ్లేషిస్తుండటం తమకు పరిపాటి అయిందని ఓ నేత అభిప్రాయపడ్డారు. ఇక జర్నలిస్టులకు అయితే అందరూ కలిసి పిచ్చాపాటిగా ముచ్చటిస్తూ.. వార్తల సేకరణతో పాటు రాజకీయ నాయకులతో ముచ్చట్లు, ఇతర డిస్కషన్స్ అన్నింటికీ ఇది ఓ ఫేవరెట్ డిస్కషన్ స్పాట్‌గా ఉంటుందని, చక్కగా చాయ్ తాగుతూ.. హెూటల్‌లో టిఫిన్ చేస్తూ..పనులు పూర్తి చేసుకోవచ్చని పలువురు చెబుతున్నారు. నాయకులతో పాటు రాజకీయాలకు సంబంధించిన అన్ని రకాల చర్చలను ఇక్కడ చందన హెూటల్ వద్ద చాయ్ తాగుతూ.. తాము చాలా కాలంగా చేస్తున్నట్టు కొందరు నేతలు పేర్కొన్నారు.

# తోటపల్లి ఐటీడీఏ పార్కు పునః ప్రారంభం

**- పర్యాటకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి**

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

ఐటీడీఏ ఆధ్వర్యంలో పునరుద్ధరించబడిన తోటపల్లి పార్కు గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే లక్ష్యంతో ఈ పార్కును కొత్తదనం ఉట్టిపడేలా, అన్ని హంగులతో దీన్ని పునరుద్ధరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి , జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్ మరియు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలసి పార్కును లాంఛనంగా ప్రారంభించారు. ఐటీడీఏ కృషిని అభినందించారు. పార్కు పునరుద్ధరణ పనులను ఎప్పటికప్పుడు జేసీ పర్యవేక్షించి, స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులతో పాటు, జిల్లా అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, పార్కు విశేషాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్, కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల నిలిచి పోయిన బోట్ రైడింగ్ సదుపాయాన్ని ఈ రోజు నుంచి తిరిగి పునః ప్రారంభించడం జరిగిందని అన్నారు. అలాగే పార్కులో అనేక కొత్త సౌకర్యాలు, హంగులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. సందర్శకులు తోటపల్లి బ్యారేజీ అందాలను వీక్షించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి వీలుగా ప్రత్యేకమైన వ్యూ పాయింట్స్ మరియు సెల్ఫీ స్పాట్‌లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి, విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా బీచ్ ఫీల్" వచ్చేలా ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ఈ పార్కును అందంగా,



ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే కాకుండా ఫుడ్, డ్రింక్స్, వాటర్ వంటి ప్రాథమిక అవసరాల కోసం కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రీ వెడ్డింగ్ లేదా పిల్లల ఫోటో షూట్‌లు, ఇతర శుభ కార్యక్రమాల కోసం ఇక్కడే ఫోటోగ్రాఫర్ మరియు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచడం జరిగిందని కలెక్టర్ జిల్లా ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుందని, ఈ సౌందర్యాన్ని, బోట్ రైడింగ్ మరియు ఫోటో షూట్ సదుపాయాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తోటపల్లి బ్యారేజ్ అందాలను తిలకించడానికి ఈ పార్కు ఒక చక్కటి గమ్యస్థానం అని వారు పేర్కొన్నారు. ఈ నూతన పార్కు స్థానిక ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు, ఉల్లాసంగా గడిపేందుకు ఒక చక్కటి వేదికగా ఉపయోగపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**- విద్యాశాఖ అధికారిని గాదె అనితాదేవి**



**వేద న్యూస్, మరిపెడ :**

మరిపెడ మండలంలో ఎల్టా మరిపెడ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎజుక్వెస్ట్ మరియు ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షలు మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మరిపెడ మండల విద్యాశాఖ అధికారిని గాదె అనిత దేవి మరియు ఎల్టా మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బయగాని రామ్మోహన్ సంయుక్తంగా ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. తదుపరి ముఖ్య అతిథి విద్యార్థుల ప్రసంగాలు మరియు రాత పరీక్షలను పరిశీలించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థినీ విద్యార్థులను ఆంగ్లంలో నిష్ణాతులుగా తయారు చేయాలని దానికి తగిన విధంగా వారికి శిక్షణను అందజేయాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పే అంశాలను విద్యార్థులు జాగ్రత్తగా నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన పోటీలలో జిల్లా పరిషత్, గవర్నమెంట్ పాఠశాలల విభాగం నుండి జూనియర్స్ లో నర్మదా జడ్పిహెచ్ఎస్ ఎల్లంపేట, సీనియర్ విభాగంలో వైష్ణవి, ఎజుక్వెస్ట్ జూనియర్ ఐశ్వర్య సీనియర్ లిఖిత జెడ్ పి హెచ్ ఎస్ గుండెపుడి లు విజేతలుగా నిలిచారు. మోడల్ స్కూల్ కస్తూర్బా పాఠశాలల నుండి హర్షవర్ధన్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ జూనియర్స్ లో హర్షవర్ధన్, సీనియర్ నుండి నాగేశ్వరి, ఎజుక్వెస్ట్ జూనియర్ దేవి విజ్ఞత, సీనియర్ అస్మితలు మోడల్ స్కూల్ మరిపెడ విజేతలుగా నిలిచారు. విజేతలకు సర్టిఫికెట్లు మరియు సీల్డ్స్ బహుకరించడం జరిగింది. విజేతలందరూ కూడా డిసెంబర్ 18, 2025 న మహబూబాబాద్ లో జిల్లాస్థాయి పరీక్షలలో పాల్గొనాలని మహబూబాబాద్ జిల్లా ఎల్టా జనరల్ సెక్రెటరీ బయగాని రామ్మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్టా రాష్ట్ర కౌన్సిలర్ ఆంతోని డిసౌజా, మరిపెడ కన్వీనర్ మంగు, కో కన్వీనర్ మల్లన్న, గైడ్ టీచర్లు దేవుల, నెహ్రూ, మర్రెడ్డి, లింగ నాయక్, లచ్చిరామ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అందరూ విజేతలను అభినందించారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం

**అమరావతి వేద న్యూస్ :**



శ్రీ సత్యసాయి జిల్లాలో బంధుత్వానికే మచ్చ తెచ్చే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్ల అమాయక బాలుడిపై చూపిన క్రూరత్వం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. వైద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తన స్వంత మేనల్లుడినే కిడ్నాప్ చేసి హత్య చేశాడనే ఆరోపణలతో మేనత్త భర్త ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్.పి. కుంట మండలం గౌకనపేట గ్రామంలో జరిగిన ఈ ఘటన ప్రాంత ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం, తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. గౌకనపేటకు చెందిన గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్ (4) బుధవారం ఉదయం ఇంటి వద్ద కనిపించకుండా పోయాడు. దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు పలు బృందాలను రంగంలోకి దించి శోధనా చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో బాలుడి మృతదేహం లభించడంతో కేసు హత్యవైపుకు మలిచింది. డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల ప్రకారం, బాలుడి హత్యలో నిందితుడు ప్రసాద్‌కే సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రసాద్ కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో తమ బావమరిది గంగాధర్‌ను వైద్య ఖర్చుల కోసం డబ్బులు అడిగాడని పోలీసులు గుర్తించారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు
# టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**- ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

**వేద న్యూస్, హైదరాబాద్:**

2010కి ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టెట్ అర్హత విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాసి విజ్ఞప్తి చేశారు. 2010కి ముందు నియమితులైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఉండగా, ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుతో మినహాయింపు లేకుండా పోయిందని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆందోళనను వ్యక్తం చేశారు. మల్క కొమరయ్య లేఖలో ప్రస్తావించిన మరికొన్ని కీలక అంశాలు చూస్తే 2009లో అమలులోకి వచ్చిన పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం స్పష్టంగా 31-03-2010 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ అర్హతను తప్పనిసరి చేసింది. 2010కి ముందు నియమితులైన వారికి ఈ నిబంధన వర్తించదని ఆ చట్టంలో ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ, వివిధ కోర్టు తీర్పులు, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం



2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు కూడా టెట్ అర్హత పరీక్షను తప్పనిసరి చేయడంతో రాష్ట్రంలో ఉన్న వేలాది మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారు అని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సేవలందిస్తున్న టీచర్స్ పై ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానాన్ని తిరోగమన చట్ట ప్రక్రియ ద్వారా అమలు చేయడం సహజ న్యాయ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధం అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల గౌరవం, సేవా భద్రత, మానసిక ఆరోగ్యం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టి లో ఉంచుకొని వారిని టెట్ బంధనం నుంచి పూర్తిగా మినహాయించాలని మల్క కొమరయ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ని ఆ లేఖలో కోరారు.

# భారత్ లేబర్ పార్టీతోనే పేద ప్రజలకు సామాజిక న్యాయం

**వేద న్యూస్, కొత్తగూడెం :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం భారత్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచారంలో ముందుగా అజ్మీరాలక్పతి సంతు సేవాలాల్ మహారాజ్, మేర మై డాడీ, జాన్ సైదులు దర్గా షరీఫ్ దర్గాలో, పెద్దమ్మ గుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించినారు. వేలాది ప్రజలు పార్టీలో చేరి ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో గట్టి అజెండాతో ముందుకు సాగుతున్న భారత్ లేబర్ పార్టీ వ్యవస్థాపక నాయకుడిగా బి. అజ్మీరాలక్పతి వేగంగా ఎదుగుతున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ లేబర్ పార్టీ ప్రకటించిన అభివృద్ధి ప్రణాళికలను గ్రామాగ్రామానికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజా సమావేశాల్లో ఆయన స్పష్టంగా చెబుతున్న సందేశం "అభివృద్ధి కోసం భారత్ లేబర్ పార్టీ ముందుకు తెచ్చిన ప్రతి ప్రణాళికను నేలమీదికి తీసుకువస్తాం ఏ సమస్యైనా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తాం" అని అన్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో భారత్ లేబర్ పార్టీ శక్తిని పెంచేందుకు అజ్మీరాలక్పతి చేపట్టిన విస్తృత పర్యటనలు, భారీ ర్యాలీ ప్రజా అభిప్రాయం సేకరణ - ఇవన్నీ పార్టీ వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయి. దీంతో ఆయన పార్టీ కీలక నేతల్లో ఒకరిగా ఎదుగుతు న్నారని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. భారత్ లేబర్ పార్టీ ప్రణాళికలను ప్రజల ముందుకు మరింత శక్తివంతంగా ప్రవేశపెడు తూ, బి. అజ్మీరాలక్పతి రాజకీయ రంగంలో తన స్థానాన్ని బలపరుచుకుంటున్న దృశ్యం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

# ఎల్ట ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ఒలింపియాడ్..

**- మండల స్థాయి ఆంగ్ల పరీక్ష, ఉపన్యాస పోటీలు**




**వేద న్యూస్, వరంగల్:**

జడ్పీహెచ్ఎస్ బాలుర ముల్కనూర్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్ .సునంద ఆధ్వర్యంలో తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ అండ్ ఎద్యుసెట్ టాక్ పోటీలు మండల స్థాయిలో ఘనంగా గురువారం నిర్వహించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎల్ట) వారి ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రభుత్వ విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞాన పరీక్ష, ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఆంగ్ల ఉపన్యాస పోటీలు ఎద్యుసెట్ టాక్ ను రెండు విభాగాలలో నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాల స్థాయి, రెండో ది మోడల్ స్కూల్, కేజీబీవీ స్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ట ప్రతినిధి పోటీ నిర్వాహకులు రామంచ బిక్షపతి మాట్లాడుతూ.. ఆంగ్ల పరిజ్ఞానము విద్యార్థుల్లో పెంపొందించడానికి ఈ పోటోలు దోహదపడతాయని చెప్పారు.ఆంగ్లభాష పై ప్రభుత్వ విద్యార్థులు పట్టు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.పి జి టి మోడల్ ముల్కనూరు కొత్త పెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ఎన్నో పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆంగ్ల భాష పై పట్టు వస్తుంది తద్వారా ఉన్నత ఉద్యోగాలు సంపాదించవచ్చని వెల్లడించారు. సునంద మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన ఇలాంటి పోటీల్లో తెలుస్తుందన్నారు, ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ అప్ తెలంగాణ వారిని అభినందించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ పాఠశాల స్థాయి నుండి జూనియర్ విభాగంలో జడ్పీహెచ్ఎస్ ఘటనర్సింగాపూర్ నుండి వి రిషిత 8వ తరగతి మరియు జి భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో గట్ల నర్సింగాపూర్ నుండి బి. సృజన, జి. ఉత్తేజిత ఎంపికయ్యారు. మోడల్ స్కూలు కేజీబీవి జూనియర్ విభాగం నుండి టీజీ ఎంఎస్ ముల్క నూరు నుండి ఎం. రామ్ చరణ్, సిహెచ్ సంకీర్తన, సీనియర్ విభాగంలో జె. కార్తీక్ టి. జి. ఎం. ఎస్ ముల్కనూర్ మరియు అయేషా తబస్సుం కేజీబీవీ భీమదేవరపల్లి నుండి విజేతలు గా జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పిడి శ్యాంసుందర్, ఉపా ధ్యాయులు సారిక ఖాన్, ఎస్ఏ హిందీ ఆర్ సదానందం ఎస్ఏ సోషల్ స్టడీస్ జూనియర్ అసిస్టెంట్ సునీత దేవి, ఇన్‌చార్జి హెచ్ ఎంసునంద, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం, నవంబర్ 28, 2025

# కడుపులో కణితి తొలగింపు

**వేద న్యూస్, జమ్మికుంట:**



ఓ పేషెంట్‌కు పొత్తి కడుపులో ఉన్న భారీ కణితిని సర్కారీ వైద్యులు తొలగించారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు పేషెంట్‌కు శస్త్ర చికిత్స చేసి కణితి తొలగించినట్లు గురువారం వైద్యులు తెలిపారు. ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఈ శస్త్రచికిత్సలో పాల్గొన్నారు

# తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం

**అమరావతి వేద న్యూస్ :**



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), టీటీడీ కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ కె. సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్ట్ చేసింది. ఇంతకు ముందు ఈ కేసులో కాంట్రాక్టర్లు, వ్యాపారులు అరెస్టైనప్పటికీ, టీటీడీ ఉన్నతాధికారిని అదుపులోకి తీసుకోవడం ఇదే తొలి ఘటన. ఈ అరెస్టుతో కేసులో నిందితుల సంఖ్య 10కి చేరింది. సిట్ విచారణలో, నెయ్యి సరఫరా కాంట్రాక్టులలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు స్పష్టమైంది. సుబ్రహ్మణ్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించడం, నాణ్యత లేని నెయ్యి సరఫరాకు సహకరించడం వంటి కీలక గతంలో అరెస్టయిన కాంట్రాక్టర్ల వాంగ్మూలాల్లో బయటపడ్డ వివరాలు సుబ్రహ్మణ్యం పాత్రను బలపరిచాయని అధికారులు పేర్కొన్నారు. లడ్డూలో ఉపయోగించే నెయ్యి నాణ్యతపై వచ్చిన భారీ విమర్శల తరువాత ఈ కేసు రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారింది. అరెస్టు అనంతరం సుబ్రహ్మణ్యంను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.తదుపరి చట్టప్రక్రియల్లో భాగంగా ఆయనను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించే అవకాశం ఉందని సిట్ వర్గాలు భావిస్తున్నాయి.

# బీఆర్ఎస్‌వి అబద్ధపు ప్రచారాలు



- కాంక్రీట్‌కు, గుండు రాయికి తేడా తెలవని వ్యక్తి కౌశిక్‌రెడ్డి
- అబద్ధాల ప్రచారంలో గులాబీ పార్టీకి ఆస్కార్ ఇవ్వొచ్చు
- జమ్మికుంటలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత ప్రణవ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

తనుగుల పరిధిలోని శంభునిపల్లి-గుంపుల చెక్ డ్యాంపై విచారణ కొనసాగుతుందనీ, మరో నాలుగైదు రోజుల్లో ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ పూర్తిస్థాయి నివేదికరాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో చెప్పినట్టు ప్రజాధనాన్ని ఎవరు దుర్వినియోగం చేసిన ఊరుకోబోమని హెచ్చరించారు.ఈ రాష్ట్రంలో ఇసుక మాఫియాకు ప్రధాన కారణం బీఆర్ఎస్ పార్టీ నాయకులని,వాస్తవాలు తెలుసుకోకుండా హరీష్ రావు మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని,ఒకవేళ చెక్ డ్యాం పేల్చితే దాని ఆనవాళ్లు చుట్టుపక్కల పరిసరాల్లో ఉంటాయి కదా.. చిన్న పటాకా పేలిస్తేనే చల్లాచదరవుతాయనీ అలాంటిది ఇంత పెద్ద చెక్ డ్యాం పేల్చారని ఆరోపణ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు వాటి ఆనవాళ్లు చూపించడం లేదని అన్నారు. కరీంనగర్ వేదికగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు విసిరిన సవాల్ కు కౌశిక్ రెడ్డి స్పందించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంక్రీట్ కి,గుండు రాయికి తేడా తెలవని కౌశిక్ రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటనీ ఎద్దేవా చేశారు. చెక్ డ్యాం పేల్చారు అంటున్న బీఆర్ఎస్ నాయకులు కాంక్రీట్ లో జిలేటిన్ స్టిక్స్ పెడతారా లేదా కుంగిన ప్రదేశం నుండి దూరంగా ఉన్న బండరాలలో పెడతారా? అని ప్రశ్నించారు. గతంలో తాము పరిశీలించినప్పుడు అక్కడ ఇలాంటి ఆనవాళ్లు ఏం కనబడలేదని,యథాస్థితిలో ఇల్లు నిర్మించేటప్పుడు కానీ చెక్ డ్యాం కట్టేటప్పుడు కానీ కింద రాళ్లు వేసి కడతారో అలాగే సమాంతరంగా రాళ్లు ఉన్నాయని, కౌశిక్ రెడ్డి మెదడు సరిగా పనిచేయదని అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని అన్నారు.నాసిరకమైన నిర్మాణం,కమీషన్ల కక్కుర్తి కోసం నిర్మాణాలు చేపట్టడం ద్వారానే ఇలాంటి నష్టం జరిగిందని,ఇసుకపై నిర్మాణం చేపట్టడం వలన ఇంతటి అనార్థం జరిగిందని,గతంలో 2022 లో కూడా ఈ చెక్ డ్యాం కుంగిందని ఇక్కడి రైతులే చెప్తున్నారని దీంతోపాటు విలాసాగర్, తనుగుల, మల్లారెడ్డిపల్లి,పెద్దపల్లి జిల్లాలోని నాలుగు చెక్ డ్యాంములు ఆనాడు కూలిపోయాయని వివరించారు.

**నీటి పారుదల శాఖలో ఐదేళ్ల అనుభవం ఇదేనా హరీష్ రావు?**

ఐదేళ్లపాటు నీటిపారుదల శాఖ మంత్రిగా చేసిన హరీష్ రావు కౌశిక్ రెడ్డి మాయలో పడ్డారని.. అందుకే హరీష్ రావు ను రాజకీయం నుండి రాజీనామా వరకు కౌశిక్ రెడ్డి తీసుకొచ్చారని ప్రణవ్ అన్నారు.హరీష్ రావుతో పాటు అక్కడ ఉన్న మాజీ మంత్రి గంగుల కమలాకర్ కి కూడా ఈ విషయంపై అవగాహన ఉందని అందుకే అక్కడ ఏం మాట్లాడలేదని చెప్పారు. గుంపుల రామభద్ర స్వామి సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు.మరోవైపు కౌశిక్ రెడ్డి బోగస్ ప్రచారాలు చేస్తాడని,అబద్ధాలు చెప్పడంలో బీఆర్ఎస్ పార్టీకి ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చని అన్నారు.కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి,జమ్మికుంట పట్టణ,మండల అధ్యక్షులు రమేష్,పరశు రామ్,మహిళా అధ్యక్షురాళ్లు రేణుక, స్వప్న,సీనియర్ నాయకులు గుడెపు సారంగపాణి, ఆరుకాల వీరేశలింగం, పొనగంటి మల్లయ్య,దేశినీ కోఠి, సదానందం, శివ, సలీం, శ్రీను,రామస్వామి మాజీ కౌన్సిలర్లు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మైనారిటీ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రజినీకాంత్‌తో మరోసారి స్క్రీన్ షేర్ చేయనున్న విజయ్ సేతుపతి

**వేద న్యూస్ డెస్క్:**



తమిళ సినీ లెజెండ్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'జైలర్' రెండో భాగం ప్రస్తుతం వేగంగా చిత్రీకరణ సాగిస్తోంది. మొదటి భాగం సాధించిన భారీ విజయంతో సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఆసక్తికర విషయం చర్చకు వచ్చింది. ఈ సినిమాలో రజినీకాంత్‌తో పాటు మరో స్టార్ నటుడు విజయ్ సేతుపతి కీలక పాత్రలో నటించబోతున్నాడనే వార్తలు తెరపైకి వచ్చాయి. ఇప్పటికే రజినీ, విజయ్ సేతుపతి కలిసి 'పేట' చిత్రంలో నటించి ఆకట్టుకున్నారు. ఇప్పుడు అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ కాబోతుందనే ప్రచారం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం గోవాలో జరుగుతున్న షెడ్యూల్‌లో విజయ్ సేతుపతి సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారనే సమాచారం కోలీవుడ్ వర్గాల్లో సందడి చేస్తోంది. సీక్వెల్‌లో కూడా మొదటి భాగంలో కనిపించిన శివరాజ్ కుమార్, మోహన్‌లాల్ పాత్రలు కొనసాగనున్నాయని టాక్ వినిపిస్తోంది. అంతేకాదు బాలీవుడ్ నటి విద్యాబాలన్‌తో పాటు కోలీవుడ్ నటుడు సంతానం కూడా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ వివరాలు బయటికి రావడంతో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అతి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. విడుదల తేదీపై రజినీకాంత్ కూడా ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే, రజినీకాంత్‌తో పాటు విజయ్ సేతుపతి చేరికతో 'జైలర్ 2'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# జనవరి 9 నుంచి నాలుగో సీజన్..

**వేద న్యూస్ డెస్క్:**




మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌కు ముహూర్తం ఖారారైంది. మెగా వేలం రోజునే టోర్నీ ఆరంభ తేదీని బీసీసీఐ వెల్లడించింది. ఊహించి నట్టుగానే జనవరిలోనే నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. అయితే.. ముందంగా వినిపించిన జనవరి 7న కాకుండా జనవరి 9 నుంచి సీజన్ మొదలవ్వనుందని డబ్ల్యూపీఎల్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ పేర్కొన్నారు. పురుషుల టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపిన విషయం తెలిసిందే.డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లకు ఈసారి రెండు వేదికలనే ఖరారు చేశారు. నవీ ముంబై , వడోదర లోనే అన్ని మ్యాచ్‌లు నిర్వహిస్తామని డబ్ల్యూపీఎల్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ తెలిపారు. జనవరి 9న నవీ ముంబైలో టోర్నీ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 5 న వడోదరలో ఫైనల్ బీసీసీఐ తెలిపింది. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు.డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ నాలుగు నగరాల్లో జరిగింది. ముంబై, బెంగళూరు, లక్నో, వడోదరలో మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే.. కొన్ని కారణాల వల్ల ఈసారి రెండు నగరాలను మాత్రమే ఎంచుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు పర్యాయాలు, ఆర్సీబీ ఒకసారి విజేతగా నిలిచాయి. దాంతో.. నాలుగో సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచేందుకు ఢిల్లీ సిద్ధమవుతుండగా.. తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ పట్టుదలతో ఉన్నాయి. నాలుగో ఎడిషన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న క్రికెటర్లు వీళ్లే..

ముంబై ఇండియన్స్ : నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు).

ఢిల్లీ క్యాపిటల్స్ : జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్(రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్(రూ.50 లక్షలు).

యూపీ వారియర్స్ : శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు).

ఆర్సీబీ : స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్(రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్ (రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది.

గుజరాత్ జెయింట్స్ : బేత్ మూనీ(రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు).

# సూర్య కొత్త చిత్రానికి భారీ స్పందన..




**వేద న్యూస్ డెస్క్:**

కోలీవుడ్ అగ్రనటుడు సూర్య నటిస్తున్న తాజా చిత్రం కరుప్పు పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఇంకా చిత్రీకరణ దశలోనే ఉన్నప్పటికీ, ఈ సినిమా నుంచి విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా ఊరమాస్ బీట్‌తో రూపొందించిన తొలి పాట నెట్టింట అభిమానులను ఉర్రూతలూగిస్తూ విస్తృతంగా వైరల్ అవుతోంది. నటుడు, దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడని ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు విడుదలైన వీడియోలో ఆయన ఇంటెన్స్ లుక్, స్టైల్, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ చిత్రంపై హైప్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. తాజాగా ఈ సినిమా ఆ తర్వాత చూపించే హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్టు సినిమా వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒక ప్రముఖ ఓటిటి వేదిక డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, ఉపగ్రహ ప్రసార హక్కులను ప్రముఖ తమిళ ఛానల్ రికార్డు ధరకు కొనుగోలు చేసినట్టు సమాచారం. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, విడుదల తేదీ ఖరారు కాకముందే ఇలాంటి డీల్స్ జరగడం ఈ సినిమా మార్కెట్ స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది. ఈ చిత్రంలో సూర్యకు జోడిగా త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో మరింత ఉత్కంఠ ఏర్పడింది. ఈ సినిమా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ ఆర్ బాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంగీతం సాయి అభ్యాంకర్ అందిస్తున్నాడు. మొత్తంగా చూస్తే, ఇంకా విడుదలకూ ముందే ఆర్థికంగా భారీ అంచనాలు నమోదు చేస్తూ, కరోపుప్పు చిత్రం ఇప్పటికే సినీపరిశ్రమలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. విడుదల తేదీ అధికారికంగా ప్రకటించిన తర్వాత ఈ హైప్ మరింతగా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పెర్త్ వేదికగా జరిగ్గిన యాషెస్
# తొలి టెస్టుకు గ్రీన్ సిగ్నల్..

**వేద న్యూస్ డెస్క్:**




ఆస్ట్రేలియా - ఇంగ్లండ్ మధ్య యాషెస్ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్ పెర్త్ మైదానంలో రెండు రోజుల్లోనే ముగియడం ప్రపంచ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. తొలి రోజు నుంచే బంతి అసాధారణంగా ప్రవర్తించడంతో బ్యాట్స్‌మెన్ నిలబడలేకపోయారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటవ్వగా, ఆస్ట్రేలియా కూడా 132 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 164 పరుగులు మాత్రమే చేయగలిగింది. 204 పరుగుల లక్ష్యాన్ని చేధించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా రెండు వికెట్లు కోల్పోయి సులువుగానే లక్ష్యాన్ని అందుకుని ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.ఈ మ్యాచ్‌లో తొలి రోజే మొత్తం 19 వికెట్లు పడిపోవడం రికార్డుగా నమోదైంది. దీంతో పెర్త్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయితే తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ పిచ్‌పై తన నిర్ణయాన్ని ప్రకటించింది. అందరి అంచనాలకు భిన్నంగా ఈ పిచ్‌కు 'అత్యంత మంచి' అనే అత్యున్నత రేటింగ్ ఇచ్చింది. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటికీ సమతుల్యం కనిపించిందన్న కారణాన్ని ఐసీసీ తన నిర్ణయంలో ప్రస్తావించింది.పిచ్ తీవ్రంగా సహకరించినా బ్యాట్స్‌మెన్ సాంకేతిక లోపాల వల్లే ఎక్కువ వికెట్లు పడిపోయాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి పూర్తి వ్యతిరేకంగా భారత్ - దక్షిణాఫ్రికా మధ్య కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన టెస్టు మూడు రోజుల్లో ముగియగా, ఆ పిచ్‌పై మాత్రం ఇంకా అధికారిక రేటింగ్ వెల్లడి కాలేదు. ఉండటంపై చర్చ కొనసాగుతోంది.

# వివాహ బంధంలోకి అడుగుపెట్టిన తెలంగాణ గాయకుడు రాహుల్

**వేద న్యూస్ డెస్క్:**



తెలంగాణకు చెందిన ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ గురువారం ఉదయం తన ప్రియురాలు హరిణ్యతో వివాహ బంధంలోకి అడుగుపెట్టాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ వేదికలో సాంప్రదాయ పద్ధతుల్లో జరిగిన ఈ వివాహ వేడుక ఘనంగా సాగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీ, రాజకీయ, క్రీడా రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి దృశ్యాలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రసారమవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ ఆల్బమ్ పాటలతో తన కెరీర్‌ను ప్రారంభించిన రాహుల్ సిప్లిగంజ్, కాలేజ్ యువతను కట్టిపడేసిన పాటలతో విశేష గుర్తింపు తెచ్చుకున్నాడు. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన పాటలు, స్టేజీ ప్రదర్శనలతో ప్రజలకు మరింత దగ్గరయ్యాడు. ఆ తర్వాత చిత్రగీతాల్లోనూ తన ప్రతిభను చాటుతూ టాలీవుడ్‌లో స్థిరపడ్డాడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'నాటు నాటు' పాటకు గాయకుడిగా గుర్తింపు పొందడం ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా మారింది.